e ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

WWW.GAYATHRINEWS.COM

# గాయత్రి న్యూస్

TGTEL/26/A3993

ప్రచురణ : తెలంగాణ గురువారం 28-05-2026 సంపుటి : 1 సంచిక :04 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

# ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి**

**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. పేజి 2లో ▶

## ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం




**నాయకులు, కార్యకర్తలు ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు: పల్లా శ్రీనివాసరావు**



2లో

**'మృతదేహాన్ని ఎవరెస్ట్‌పైనే వదిలేస్తాం'.. హైదరాబాదీ పర్వతారోహకుడి కుటుంబం**



## మహిళలకు టిడిపి పెద్దపీట

- పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం
- తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్



2లో

## అమెండెడ్ భారత్‌నెట్‌పై కేంద్రంతో సీఎం రేవంత్ చర్చ

**అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాంపై కేంద్రమంత్రితో చర్చించిన సీఎం రేవంత్**



2లో

హైదరాబాద్: అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు.

**ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి**
**జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు**
**కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు**
**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి**



## ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు..

**డ్రైవింగ్ లైసెన్సులు స్వాధీనం**

హైదరాబాద్: నగరంలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. నాగోల్, కొండాపూర్, మేడ్చల్ కార్యాలయాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ ఫీజుకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద 150 ప్రింటెడ్ ఆర్సీలు, డీఎల్‌లు.. నాగోల్ కార్యాలయంలో ఏజెంట్ల వద్ద రూ.2.41 లక్షలు, డ్రైవింగ్ స్కూల్ యజమాని సుధాకర్‌రెడ్డి వద్ద 184 డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. ధ్రువపత్రాల మంజూరులో దళారుల పాత్రను ఏసీబీ గుర్తించింది. ఈ అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ఘర్షణ..

**కిందపడిన ఫిరోజ్‌ఖాన్**



హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజ్రీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు.

మిగతాది 2లో

## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్



మిగతాది 2లో

# సంపాదకీయం

## పాలకుల నిర్దేశాలే న్యాయ నిర్ణయాలా?

'న్యాయవ్యవస్థ విశ్వసనీయత కోల్పోతే ఇక మిగిలేదేమీ ఉండదు. స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ జీవ లక్షణం. అది లేకపోతే.. న్యాయమూర్తులు ఉంటారు, కోర్టులు ఉంటాయి, తీర్పులు ఉంటాయి. అయితే వాటి హృదయమూ, ఆత్మ కనుమరుగైపోతాయి' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) అన్నారు. ఇటీవల పుణేలో వెలువరించిన ఒక స్మారకోపన్యాసంలో కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకే ఒక హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేస్తున్నామని కొలీజియం స్వయంగా తన మినిట్స్‌లో రికార్డు చేసిందని కూడా ఆయన వెల్లడించారు. రాజ్యాంగానికి నిబద్ధమై స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఒత్తిడికి లోనవుతూ పనిచేస్తోందని అనడానికి అది ఒక స్పష్టమైన నిదర్శనం.

'న్యాయవ్యవస్థ పార్టీ రాజకీయాలకు దూరంగా, దృఢ చిత్తంతో వ్యవహరించాలి. ప్రభుత్వంలో మార్పులకూ, న్యాయవ్యవస్థకూ ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. అది అందరి పట్లా సదుద్దేశం, సానుభూతితో వ్యవహరించాలి కాని ఎవరి పక్షానా కొమ్ముకాయకూడదు' అని సుప్రీంకోర్టు ప్రారంభ సమావేశంలో తొలి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరిలాల్ జె కానియా ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయాయి. అది ఎలా అమలువుతుందని సమీక్షించుకుంటే సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణాలు సమున్నతమయ్యాయా లేక దిగజారిపోయాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.నిజానికి మన రిపబ్లిక్ చరిత్రలో మొదటి పాతికేళ్లవరకు న్యాయవ్యవస్థ తన ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పరిధిని నిర్ణయించడంలో తన వంతు బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించింది. ముఖ్యంగా అధికరణలు 14, 15, 19, 31లను సుప్రీంకోర్టు నిర్వచించింది. ప్రాథమిక హక్కులను మార్చేందుకు ఏ మాత్రం వీలు లేదని 1967లో గోలక్‌నాథ్ కేసులో స్పష్టం చేస్తే, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని 1973లో కేశవానంద భారతి కేసులో మరింత తేటతెల్లం చేసింది. 1971లో అఖండమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థతో చెలగాటమాడారు. ఆమె చర్యలకు వత్తాసు పలికిన న్యాయవ్యవస్థ పతనానికి పరాకాష్ఠ ఏడీఎం జబల్పూర్ కేసు. వేలాది రాజకీయ ప్రత్యర్థులను, జర్నలిస్టులను అరెస్టు చేసినప్పుడు ప్రజలు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చా అని అడిగితే సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత దుర్మార్గమైన తీర్పు వెలువరించింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు ఆర్టికల్ 21 క్రింద జీవించే హక్కే లేదని ఆ ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు-- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ పి.భగవతి, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ (రెండేళ్ల క్రితం సీజేఐగా రిటైరైన డివై చంద్రచూడ్ తండ్రి)-- ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. 'ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపినా అడగకూడదంటారా?' అని ఈ కేసులో నిరసన తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ప్రశ్నించినప్పుడు 'మిలార్డ్, చట్టం అదే చెబుతున్నది' అని నాటి అటార్నీ జనరల్ జవాబిచ్చారట!

న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజులు అనదగిన ఎమర్జెన్సీ తర్వాత సుప్రీంకోర్టు ఎన్నో ఆత్మవిమర్శలు చేసుకుంది. ఎన్నో దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ఎమర్జెన్సీ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించింది. అనేక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు అవకాశం కల్పించింది. జైలులో విచారణ లేకుండా కునారిల్లుతున్న వేలాది ఖైదీలను విడుదల చేసింది. కట్టుబానిసలను విముక్తి చేసింది. న్యాయవ్యవస్థలో నియమాకాలకు కొలీజియం పద్ధతిని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రజల హక్కులను, పర్యావరణాన్ని, పనిచేసే మహిళల ప్రయోజనాలను పరిరక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా గద్దె దించడాన్ని అడ్డుకున్నది. చట్టసభల్లోనే ప్రభుత్వాలు మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించింది. వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులెన్నో. ఒక దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అబ్బురపరిచేలా కనపడింది.

ఇవాళ ఎమర్జెన్సీ రోజులు లేకపోవచ్చు. కాని న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయి. జస్టిస్ ఉజ్వల్ భుయాన్ లాంటి న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో ఎవరూ చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని, న్యాయమూర్తుల రాజకీయ, సైద్ధాంతిక అభిప్రాయాలు బెంచ్‌లో నిర్ణయాలను ప్రభావితం చేయకూడదని అన్నారంటే తరిచి చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తులు బయటి నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదని, తమకొచ్చే ఆదాయంతో తృప్తిగా జీవించలేని న్యాయమూర్తులను వ్యవస్థనుంచే తొలగించాలని మరో ప్రస్తుత సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఒక కళంకిత న్యాయమూర్తి వ్యవస్థకే మచ్చలాంటి వాడని ఆమె వ్యాఖ్యానించారు. 'నిష్పాక్షికత న్యాయవ్యవస్థ ఆత్మ, స్వతంత్రత న్యాయవ్యవస్థ నరాల్లో ప్రవహించే రక్తం' అని ఒడిషా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ అన్నారు.

## అమెండెడ్ భారత్‌నెట్‌పై కేంద్రంతో సీఎం రేవంత్ చర్చ

మొదటిపేజీ తరువాయి

అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై కేంద్రమంత్రితో సీఎం ప్రస్తావించారు. దీనిపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## నాయకులు, కార్యకర్తలు ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు: పల్లా శ్రీనివాసరావు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మహానాడు ప్రారంభం సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు.. ఇప్పటి వరకూ పార్టీ ప్రయాణం, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇతర అంశాలను ఈ వేదిక ద్వారా చర్చించుకుందామన్నారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు 2026 ద్వారా లక్షల సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అనుసంధానమై ఉన్నారని తెలిపారు. దేశంలో వివిధ రాజకీయ పార్టీలు వచ్చి కాలగర్భంలో కలిసి పోయాయని, తెదేపా ఒక్కటే నిత్యచైతన్యంతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలందరికీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే అన్ని నామినేటెడ్ పదవులూ కార్యకర్తలకు ఇచ్చామని, భవిష్యత్తులోనూ ఇంకా వస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్-2047 రూపొందించారన్నారు. 63 శాతం యువతకు పార్టీలో ప్రాధాన్యత దక్కుతోందన్నారు. 26 ఏళ్లకే రామ్మోహన్ నాయుడు ఎంపీ, తర్వాత కేంద్రమంత్రి అయ్యారన్నారు. గంటి హరీష్ 27 ఏళ్లకు ఎంపీ అయ్యారని వివరించారు. గతంలో అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు లాంటి నేతలు చిన్నవయసులోనే పార్టీలో కీలక నేతలుగా ఎదిగారని పల్లా శ్రీనివాసరావు గుర్తుచేశారు.

## 'మృతదేహాన్ని ఎవరెస్ట్‌పైనే వదిలేస్తాం'.. హైదరాబాదీ పర్వతారోహకుడి కుటుంబం

మొదటిపేజీ తరువాయి

గతవారం పర్వతారోహణ ముగించుకొని దిగువకు వస్తుండగా ఎవరెస్ట్ (వీ జుజవతీవర్)పై హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు అరుణ్ కుమార్ తివారీ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాన్ని పర్వతంపైనే వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్లు అతడి కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతుడి బావమరిది సుధీర్ ఉపాధ్యాయ మాట్లాడుతూ.. శివుని నివాసమైన పర్వతాలలో అరుణ్ కుమార్ ప్రాణాలు వదిలారు కాబట్టి అక్కడే వదిలేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు చేపట్టే ప్రక్రియలు ముగిసే సరికే మృతదేహం చాలా దెబ్బతింటుందని.. మంచులో నుంచి దానిని తీసే ప్రక్రియ కూడా చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. అందువల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎవరెస్ట్ యాత్రను నిర్వహించిన నేపాల్‌కు చెందిన పయనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేశ్ కర్కి మాట్లాడుతూ 2025లో కూడా ఎవరెస్ట్ అధిరోహించడానికి తివారీ ప్రయత్నించగా.. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 7200 మీటర్ల ఎత్తు నుంచి వెనుదిరిగినట్లు పేర్కొన్నారు. గత వారం ఎవరెస్ట్‌ను విజయవంతంగా అధిరోహించి కిందకు దిగుతుండగా అస్వస్థతకు గురై శిఖరానికి కొంచెం దిగువన ఉన్న హిల్లరీ స్టెప్ (డెత్ జోన్) సమీపంలో కన్నుమూసినట్టు పేర్కొన్నారు. అది చాలా ఎత్తులో ఉన్నందున అక్కడి నుంచి మృతదేహాన్ని కిందకు తీసుకురావడం చాలా ప్రమాదకరమైన.. ఖరీదైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ఘర్షణ..

మొదటిపేజీ తరువాయి

ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

మొదటిపేజీ తరువాయి



భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాల్లో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## మహిళలకు టిడిపి పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

## ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఉత్తరాఖండ్, గుజరాత్ తర్వాత దీనికి ఆమోదం తెలిపిన మూడో రాష్ట్రంగా నిలిచింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల (ఆర్టికల్ 44) ప్రకారం.. దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలనేది దీని ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ (ఎఱఎఖుణ్ఖు దీఱంఖు ఘుతీఎఖు) మాట్లాడుతూ.. యూసీసీ అమలుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ చట్టం అమలుపై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. యూసీసీ అమలుతో సమాజంలో చాలా విషయాల్లో ఏకరూపత వస్తుందన్నారు. మహిళలను రక్షించడం, వారి గౌరవం, సమానత్వాన్ని నిర్ధరించడం ఈ బిల్లు లక్ష్యమని పేర్కొన్నారు.

కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడులు

యూసీసీలోని కీలక అంశాలు!

వివాహం, విడాకులు, ఆస్తుల వారసత్వం, ఆస్తి వీలునామాల రూపకల్పన వంటి అంశాల్లో లింగ సమానత్వాన్ని సాధించేలా ఉంటుంది.

మతాలతో సంబంధం లేకుండా సమానత్వాన్ని సాధించేందుకు దోహదం చేయనుంది.

సహజీవన సంబంధాలను క్రమబద్ధీకరించే నిబంధనలను యూసీసీలో పొందుపరిచారు. సహజీవనం చేస్తున్నవారు ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వం తరఫున ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

అన్ని మతాలకు చెందిన స్త్రీ, పురుషులకు కనీస వివాహ వయస్సు ఒకేలా ఉంటుంది.

అన్ని మతాల్లో బహుభార్యత్వంపై నిషేధం

హలాల్ విధానంపై నిషేధం

ఇది ఓ రాజకీయ అజెండా: కాంగ్రెస్

భాజపా తమ రాజకీయ అజెండాలో భాగంగా ఈ చట్టాన్ని చేసిందని కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం) ఆరోపించింది. యూసీసీలో పొందుపరిచిన బాల్య వివాహాలు, విడాకులు, భరణం, బహుభార్యత్వం వంటి సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయని కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత వాజెద్ అలీ చౌదరి పేర్కొన్నారు. వాటి కోసం కొత్త చట్టాన్ని అమల్లోకి తేవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యం కాదని.. ఆదివాసీలను మినహాయించే ఈ చట్టాన్ని ఏకరీతి చట్టం అని ఎలా అంటామని ప్రశ్నించారు.

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటిపేజీ తరువాయి

తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు.

# దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి కల్పించిన ఆకుల నరేష్‌కు ఘన నివాళి

**– అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

గాయత్రి న్యూస్

వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ మాజీ ప్రవాస వ్యాపారవేత్త ఆకుల నరేష్ కుమార్ అకాల మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. దుబాయ్‌లో ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన నరేష్ కుమార్ ఇటీవల కేదార్నాథ్ యాత్రలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం వేములవాడలో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆది



శ్రీనివాస్ మాట్లాడుతూ ఆకుల నరేష్ సాధారణ కార్మికుడిగా గల్ఫ్ జీవితాన్ని ప్రారంభించి తాను కష్టపడి పనిచేసే తత్వంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. దుబాయ్‌లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వాన్ని అందించిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు. యువతకు మార్గదర్శకుడిగా నిలిచిన నరేష్ సేవలు చిరస్మరణీయమన్నారు. నరేష్ మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న అనేక కుటుంబాలకు తీరని లోటని దిగ్భ్రాంతినీ వ్యక్తం చేశారు. జీవితంలో పుట్టుక,మరణాలు సహజమని మనకు దూరమైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు కుమ్మరి శంకర్,ఇప్పపూల అజయ్, నాయకులు మదాడి గజానంద రావు,ఏనుగు మనోహర్ రెడ్డి,కొండ దేవయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు,పట్టణ ప్రముఖులు,జర్నలిస్టులు,కుటుంబ సభ్యులు,భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆకుల నరేష్‌కు చివరిసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు.

# జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి.

గాయత్రి న్యూస్




భారత తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా చేర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు దాసరి శ్రీకాంత్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజె మల్లేశం, సీనియర్ నాయకులు,కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నామినేటెడ్ డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం

**– రాష్ట్ర నాయకులు గరిపల్లి ప్రభాకర్**
**– మండల అధ్యక్షులు కోడె రమేష్**
**– మండల మహిళా అధ్యక్షురాలు జమున**

గాయత్రి న్యూస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం. భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ మరియు( బి ఎల్ ఎ )2 మండల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథిగా గరిపెల్లి ప్రభాకర్ గారు విచ్చేసి మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే నాయకుడు దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి అంకితమైన దృక్పథం క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావం కలిగిన వ్యక్తిత్వం బలమైన నిర్ణయాలు తీసుకుని మార్పు తీసుకువచ్చే శక్తి చూపిన మార్గంలో నడుచుకుంటూ, ప్రజల కోసం కృషి చేయాలి. ఇది కేవలం గౌరవం మాత్రమే కాదు -- ఒక బాధ్యత, ఒక కర్తవ్యంగా ప్రతి కార్యకర్త తీసుకోవాలి అన్నారు. సేవ, నమ్మకం, అభివృద్ధి ఇదే బీజేపీ సిద్ధాంతమన్నారు. బి ఎల్ ఏ -2 ( బూత్ లెవెల్ ఏజెంట్)ఈ సమావేశం ప్రధానంగా బూత్ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణలో సమన్వయం పెంచడం కోసం ఏర్పాటు చేయబడుతుంది. బి ఎల్ ఏ -2 ముఖ్య ఉద్దేశాలు ప్రతి బూత్‌లో పార్టీకి ఉన్న బలహీనతలు, బలాలను గుర్తించడం ఓటర్ల జాబితాను పరిశీలించి, తప్పులు సవరించడం కొత్త ఓటర్ల నమోదు ( ఎన్రోల్మెంట్) పై దృష్టి పెట్టడం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం పెంపొందించడం సమావేశంలో బూత్ వారీగా ఓటర్ల వివరాలు గత ఎన్నికల విశ్లేషణ సోషల్ మీడియా వినియోగం ద్వారా ప్రచారం చెయ్యడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల తప్పులను ప్రజల్లో బహిర్గతం చేయాలని ప్రతి కార్యకర్త తన బూత్‌లో కనీసం 20-30 కుటుంబాలను సంప్రదించాలి కొత్త ఓటర్లను నమోదు చేయించాలి పార్టీపై నమ్మకం పెంచే విధంగా ప్రజలతో మాట్లాడాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను , విజయాలను ప్రజలకు వివరించాలి బి ఎల్ ఎ -2 సమావేశంలో



మండల అధ్యక్షులు రమేశ్ మాట్లాడుతూ ప్రతి నాయకుడు కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, వచ్చే ఎన్నికల్లో విజయాన్ని సాధించడానికి పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రతి కార్యకర్త ఈ సమావేశంలో చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ నాయకులు నర్సింలు గణేష్ రెడ్డి జమున బండ దేవయ్య పత్తి స్వామి సర్వోత్తమ్ నాగరాజుగౌడ్ దేవేందర్ గౌడ్ రవీందర్ స్వామి సత్యం శ్రీనివాస్ చారి నర్సింలు మధు పూల్య నాయక్ మల్లేష్ గౌడ్ దేవేందర్ యాదవ్ శ్రీనివాస్ చంద్రం యాదవ్ రాజేష్ చారి నరేష్ నాయకులు పాల్గొన్నారు

# లూజ్ వైర్ సరి చేయాలని ఏఈకి వినతి పత్రం

గాయత్రి న్యూస్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీలోని పలు ఇండ్లపై నుండి కరెంటు వైర్లు ఉన్నవి అవి లూజుగా ఉండి వర్షాకాలం గానీ గాలి దుమారం పెట్టినప్పుడు వైలు తెగిపోవడం కాలనీలో కరెంట్ పోవడం జరిగింది దాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడైనా సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు ఎన్నోసార్లు గతంలో ఉన్న ఎఈ కి మరియు సిస్ సిబ్బందికి



చెప్పిన పట్టించుకోవడంలేదని అవి సరిచేయాలని ఎస్సీ కాలనీ దృష్టిలో పెట్టుకొని తొందరగా లూస్ వైరు సరిచేయాలని ఏఈ గారికి స్థానిక మాజీ వార్డ్ సభ్యులు మరియు జిల్లా అంబేద్కర్ సంఘాల ఉపాధ్యక్షులు బండ రమేష్ కోరారు

# తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడు ను విజయవంతం చేద్దాం.

గాయత్రి న్యూస్

తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో మే 27,28



తేదీలలో దేగాం యాదగౌడ్ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించే వర్చువల్ మహానాడు కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గంలోని వివిధ మండలాల టిడిపి నాయకులు, సీనియర్ నాయకులు,తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్తలు, పార్టీ అభిమానులు, తెలుగు యువత,తెలుగు మహిళా నాయకురాలు, ఎన్టీఆర్ అభిమానులు,అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం ధచేద్దామని అలాగే,అందరూ తమ యొక్క పార్టీ సభ్యత్వం కార్డు తీసుకొని రాగలరని కోరుట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, జిల్లా ఎన్టీఆర్ ఓల్డ్ అభిమాన సంఘ అధ్యక్షులు మానుక ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ' జస్టిస్ ' కేజీ బాలకృష్ణన్ కి తన నివేదికను సమర్పించిన ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ.

గాయత్రి న్యూస్

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై అధ్యయనం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడినటువంటి ప్రత్యేక కమిటీ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కి న్యూఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగ తన నివేదికను సమర్పించడం జరిగింది. 200 పైగా పేజీలతో కూడిన ఈ నివేదికలో దళిత క్రైస్తవులకు సంబంధించిన



విద్యా,వైద్య, సామాజిక ,సాంస్కృతిక , ఆర్థిక పరిస్థితులను పేర్కొంటూ వారికి ఎస్సీ హోదా మరియు రాజ్యాంగ హక్కులను కల్పించాలని కమిటీకి వీ౹రూ తరుపున విజ్ఞప్తి చేశారు. అలాగే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు మరియు సామాజిక వివక్షత , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఇతర అంశాలు ,కుల వ్యవస్థ ప్రభావం మొదలగు అంశాలను ఈ నివేదికలో పొందుపరిచి సుదీర్ఘ కాలంగా నలుగుతున్న సమస్య పరిష్కారం కోసం కమిటీ ముందు కొన్ని ప్రతిపాదనలు పెట్టడం జరిగింది.

# ఈదురుగాలులకు ఇళ్ల రేకులు ఎగిరిపాటు.. బాధితుల ఆవేదన

గాయత్రి న్యూస్

గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన



బామాండ్ల రజిత-మల్లేష్, బామాండ్ల చంద్రయ్య-వీరమల్లయ్య కుటుంబాలకు చెందిన ఇళ్ల రేకులు భారీ గాలులకు ఎగిరిపడి కిలోమీటర్ల దూరం వరకు కొట్టుకుపోయాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి కూడా దెబ్బతినడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తాము తీవ్ర నష్టపోయామని, ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

# ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం నేలరాలిన మామిడి ఆందోళనలో రైతులు.

గాయత్రి న్యూస్

వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో





ఐకెపి, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసి ముద్దయిన వడ్లను పరిశీలించారు. వెంటనే బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులు సూర రాజు, బైకని యాదయ్య, రేసు పావని తదితరులు పాల్గొన్నారు.

1

# 4వ మహాసభల లోగోను ఆవిష్కరించిన సిపిఐ నాయకులు

గాయత్రి న్యూస్

ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం రూపొందించిన లోగో ను కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,ఆహ్వాన సంఘం అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్,టేకుమల్ల సమ్మయ్య,కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఏఐటియుసి జిల్లా నాయకులు అందరూ తదితరులు పాల్గొని ఆవిష్కరించారు.





4

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం

'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో




కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ. 10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ. 45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్లు నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ. 45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.

# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే

## ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.



# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు

'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.

# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ



తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకోచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.

# 17 ఏళ్ల తర్వాత ఆ ప్రయోగం..

## 'పెద్ది' కథను మలుపు తిప్పే మ్యాచ్ అది!


దాదాపు 17 ఏళ్ల తర్వాత 'పెద్ది'లో దిల్లీ ఎపిసోడ్ కోసం మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించామని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విశేషాలను రత్నవేలు పంచుకున్నారు.

### అవన్నీ రీ క్రియేట్ చేశాం..

"పెద్ది' దాదాపు 40 ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కానీ, ఒకప్పటి విజయనగరానికి ప్రేక్షకులను తీసుకెళ్లాలి. అదంతా ఒక ఊహా ప్రపంచం. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజెస్ తీసుకుని, 'పెద్ది' కథను ఎలా చెప్పాలి? విజువల్‌గా ఎంత అందంగా క్రియేట్ చేయాలనే దానిపై చాలా పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ ఇలా ఒక్కో అంశాన్ని వరల్డ్ బిల్డింగ్ చేస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వారి లైఫ్ స్టయిల్ ఇలా ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది"

### కథను మలుపు తిప్పే మ్యాచ్..

"పెద్ది'లో నాకు అత్యంత కష్టంగా అనిపించింది క్రికెట్ మ్యాచ్. ఇది స్పోర్ట్స్ బేస్డ్ సినిమా. కెమెరామెన్‌తో పాటు మొత్తం టీమ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు, కథలోనే ఒక పెద్ద మలుపు. ఆ మ్యాచ్‌ను రాత్రిపూట షూట్ చేద్దామని బుచ్చిబాబు గారికి సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. ఆయనకు ఆ ఆలోచన నచ్చింది"




### హనుమంతుడి రెఫరెన్స్..

"అలాగే కుస్తీ పోటీలు కూడా మరో పెద్ద ఛాలెంజ్. ఒక గెటప్ అనుకున్న తర్వాత కాస్ట్యూమ్స్, బాడీ మార్చుకుంటే సరిపోతుంది. కానీ, ఇందులో రామ్ చరణ్ కుస్తీ విషయానికి వచ్చేసరికి తన బాడీలోని ప్రతి మజిల్‌పై వర్క్ చేశారు. ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్‌లో ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి"

### చివరి 30 నిమిషాలు ప్రేక్షకుడిని కదలిస్తుంది..

"ఈ సినిమా క్లైమాక్స్ కూడా చాలా ఛాలెంజింగ్. ఇప్పుడే దాని గురించి ఎక్కువ చెప్పకూడదు. అది ప్రేక్షకులకు కన్నుల పండుగలా ఉంటుంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు సినిమా ప్రేక్షకులని కదిలిస్తుంది. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇందులో దిల్లీలో చిత్రీకరించిన సన్నివేశాలు నాకు చాలా ఫేవరెట్. అక్కడ నేను లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం ఫిల్మ్ నెగటివ్‌ను వాడాం. దాదాపు 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించాను. ఇప్పుడు ఉన్న డిజిటల్ కెమెరాలు అద్భుతమైన ఔట్‌పుట్ ఇస్తున్నప్పటికీ, ఒక రియల్ ఫీల్ కోసం వాడాం"

### మంచి యాక్షన్ థ్రిల్లర్ తీస్తా!

"నేను ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 30 సంవత్సరాలు అయ్యింది. ఏడాదికి ఒక సినిమానే చేస్తాను. ఒక సినిమా కమిట్ అయితే అది పూర్తయ్యే వరకు వేరేవి చేయను. ఇప్పటికే మూడు కథలు రాశాను. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. అలాగే ప్రతి పాత్ర కూడా కథలో ఇంపార్టెంట్‌గా ఉండాలి. మా అబ్బాయి కూడా కెనడాలో సినిమాటోగ్రఫీ చదువుకున్నాడు. నాలాగే తనకూ సినిమాపై చాలా ప్యాషన్. 'పెద్ది'లో ఒక కుస్తీ ఫైట్ అద్భుతంగా షూట్ చేశాడు" అని అన్నారు.



# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత

## మెగా ఫ్యాన్స్‌లో గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం కొనసాగడం ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి పెంచుతోంది.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SUJATHA NAGAR, BHADRADRI KOTHAGUDEM, TELANGANA - 507120 PRGI Reg No - TGTEL/26/A3993 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.